ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (మురమళ్ళలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 13-11-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహము పుట్టినపుడు మనం పుట్టాము అనుకుంటున్నాము. దేహము మరణించినపుడు మనం మరణిస్తున్నాము అనుకుంటున్నాము. దేహము పుట్టకముందు మనం లేము అనుకుంటున్నాము. దేహం మరణించిన తరువాత మనం ఉండము అనుకుంటున్నాము. ఇలా దేహమునకు పరిమితమై ఉంటాము. ఇది దేహబుద్ధి. మోక్షం రావాలంటే దేహబుద్ధి నశించాలి. దేహబుద్ధి నశిస్తేనే గాని ఆత్మలాభం కలుగదు.

దేహము మరణిస్తుంది. స్మశానంలో దేహంకాలిపోయినపుడు మానసిక కర్మ కాలదు. మానసిక కర్మ వ్యక్తం అవ్వాలంటే దేహముకావాలి. మానసిక కర్మనే జీవుడు అంటారు. మానసిక కర్మకే కొత్తదేహం వస్తుంది. మానసిక కర్మ, దేహము విడిపోవటం మరణం అంటారు. మానసిక కర్మ, దేహము కలవటాన్ని పుట్టటం అంటారు. శరీరము పుట్టుక పుట్టుకా కాదు. శరీరం యొక్క మరణం మరణమూ కాదు అన్నారు భగవాన్. అహంభావన పుట్టుకే నీ పుట్టుక. అహంభావన ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు నీవు వస్తువులోనుండి వేరు పడిపోయావు. నీలోపల ఒక సత్య వస్తువు వుంది. దాని గురించి శ్రవణం చెయ్యాలి. శ్రవణం చేయగా, చేయగా దాని గురించి నీకు తెలుస్తుంది. బ్రహ్మానుభవం పొందటానికి ఏవిషయాలు అయితే అవరోధంగా ఉన్నాయో అవి తొలగేవరకూ శ్రవణం చెయ్యాలి.

శ్రవణం చేస్తేనేగాని మనోవికాశము రాదు. మనో వికాశము కలిగినపుడు మీలో లోపాలు ఏమి ఉన్నాయో మీరు చూసుకొంటారు. మనస్సులో వికాశము లేకపోతే ఎల్లప్పుడు ఎదుటివారిలో లోపాలు వెదకటానికి చూస్తారు. ఎదుటివారిలో లోపాలు చూస్తూ ఉంటే మనోవికాసము లేదు అని గుర్తు. ఎవడి పొరపాట్లు వాడు గుర్తిస్తూ ఉంటే వాడు పక్కానికి వచ్చినట్లు లెక్క. వాడికి నెమ్మదిగా లోచూపు కలుగుతుంది. లోచూపు కలగటం వలన మనస్సు అంతర్ముఖమవుతుంది. అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

నేను ఆత్మను అని చెపుతున్నారు. ఆత్మలో కోరికలు లేవు అంటున్నారు. అయితే నాకు కోరికలు ఎందుకు వస్తున్నాయి అని ప్రశ్నించారు. నువ్వు ఆత్మవే, కాని నీవు ఏమనుకొంటున్నావు - నేను ఆత్మను అనుకోవటంలేదు, నేను మనస్సును అనుకొంటున్నావు. నువ్వు ఆత్మవే అయినా ఆత్మతో తాదాప్యం నీకు లేదు. మనస్సుతో తాదాప్యం పొందుచున్నావు. అందువలన మనస్సులో ఉన్న కోరికలు వస్తున్నాయి. నేను ఆత్మను అని నోటితో చెపుతున్నావు. కాని మనస్సుతో తాదాప్యం పొందుచున్నావు. అందువలన కోరికలు వస్తున్నాయి. ఆత్మలో కోరికలు లేవు. దానితో నీకు తాదాప్యం లేదు. ఏ వస్తువులో అయితే కోరికలు లేవో దానితో నీకు తాదాప్యం వచ్చినపుడు కోరిక సమస్యలేదు. కోరికలు మనస్సులో ఉన్నాయి. నేను మనస్సును అనుకొంటున్నావు. అందువలన ప్రకృతిని చూసి కోరిక ఉదయిస్తుంది.

గురువు సౌహృదయంలో ఉన్నాడు అని చెపుతున్నారు. నేను లోపల ఉన్న గురువు గురించి అడగటంలేదు. నాకు కావలసినది లోపల ఉన్న గురువు కాదు, నాకు బాహ్యంగా ఉన్న గురువు కావాలి అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. ఆ బాహ్యంగా ఉన్న గురువే చెపుతున్నాడు నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు అని

ఆయన చెప్పారు.

తెలియక చేసాము, తెలిసి ఉండి అనుభవిస్తున్నాము అని కొందరు అంటూ ఉంటారు. మనం చేసినది ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలో అయినా అనుభవంలోనికి వచ్చి తీరుతుంది. అనుభవంలోనికి వస్తేగాని అది బయటకు పోదు.

బంధువులు, స్నేహితులు, తల్లిదండ్రులు అందరూ కర్మనుబట్టి వస్తారు. కర్మ తెగిపోతే అంతా తెగిపోతుంది. సుఖం వచ్చినా, దుఃఖము వచ్చినా అది మీ ప్రారబ్ధ ఫలమును బట్టి వస్తుంది. అన్నీ ప్రారబ్ధ ఫలమునుబట్టి వస్తాయి అని చెపుతున్నారు. ఇంక సాధన ఎందుకు అని ఒకరు అడిగారు. నీ ప్రారబ్ధమును బట్టి సుఖం వచ్చినా, దుఃఖము వచ్చినా నీవు చేసే సాధన దానితో తాదాప్యం పొందకుండా చేస్తుంది. నీకు దుఃఖము వచ్చేయోగం ఉంది అనుకోండి. దుఃఖము వస్తుంది. సాధన ఏమి చేస్తుంది అంటే దానితో తాదాప్యం పొందకుండా చేస్తుంది.

చనిపోయిన తరువాత ఎక్కడ ఉంటాము అని అడుగుతూ ఉంటారు. రోజూ నిద్రలో ఎక్కడ ఉంటున్నారో చనిపోయిన తరువాత కూడా అక్కడే ఉంటారు. ఒక్క బ్రహ్మం తప్పించి మిగిలినవన్నీ కర్మసంబంధాలు. కర్మనుబట్టి జన్మ వస్తుంది. కర్మ ఎవరికి? అహంకారానికే. జన్మ ఎవరికి? అహంకారానికే. అహంకారమును విచారణ చేసి దాని మూలమును పట్టుకొంటే కర్మాలేదు, జన్మాలేదు అన్నారు రమణస్వామి.

ధ్యానమార్గము వేరు, విచారణామార్గము వేరు. ధ్యానము, విచారణ చేసేది మనస్సే. ఏకవస్తువును నిరంతరము చింతించటాన్ని ధ్యానం అంటారు. ఏకవస్తువును నిరంతరము చింతించటమువలన కూడా మనస్సు నశిస్తుంది. మనస్సు యొక్క మూలాన్ని వెతకటం విచారణామార్గము. మనో మూలాన్ని వెతకటం వలన కూడా మనస్సు నశిస్తుంది.

మీరు పూజ చేసుకోండి, జపం చేసుకోండి, ధ్యానం చేసుకోండి, విచారణ చేసుకోండి. మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణం చేయండి. ఏ మార్గములో ప్రయాణం చేసినా చిత్తశుద్ధి కలగాలి. మీరు చేసే సాధనలో నేనును ఇన్వాల్వ్ చెయ్యాలి. నేనును మినహాయించి సాధనలు చేస్తున్నారు. మీరు చేసే సాధనలో మొట్టికాయలు తగలవలసింది ఈ నేనుకే. మాయ అంతా నేనులోనే ఉంది. నాదిని విడిచిపెడితే చిత్తశుద్ధి కలుగుతుంది, నేనును విడిచిపెడితే మోక్షం కలుగుతుంది అన్నారు భగవాన్. మనకు అతి సన్నిహితంగా మన హృదయంలోనే సత్యవస్తువు ఉన్నప్పటికీ అది అనుభవంలోనికి రాకుండా అడ్డుపడేది మన నేనే. అంటే అబద్ధమైన నేను. ఈ అబద్ధమైన నేనును నీవు నిజమైన నేను అనుకొంటున్నావు. శ్రవణం చేసి ఇప్పుడు నీకు వ్యక్తమయ్యే నేను అబద్ధమైన నేను అని అర్థంచేసుకోగలిగితే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తావు. శ్రవణం చేయకపోతే ప్రయత్నం చేయాలి అనే బుద్ధి కూడా కలుగదు. దేవుని స్మరించుకోవాలి అనే బుద్ధి నీకు కలుగుతూ ఉంటే అది నీ గొప్పతనం కాదు. కేవలము దేవుని అనుగ్రహమే. ఆయన అనుగ్రహం మనకు లేకపోతే ఆయనను తెలుసుకోవాలి అనే బుద్ధి కూడా మనకు కలుగదు.

నీవు ఎవడివో తెలుసుకోమని చెపుతున్నారు. ఎవరిని తెలుసుకోమంటారు అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకోమంటున్నాను అన్నారు భగవాన్. నువ్వు ఎవడిగా ఉన్నావు. ఆత్మగా ఉన్నావు. ఆత్మగా ఉన్నావుగాని దానికి సంబంధించిన అనుభవం నీకు లేదు. అందుకు దానిని తెలుసుకోమని అడుగుతున్నాను. చదువుకున్నవారు వచ్చినా నువ్వు ఎవడివో తెలుసుకోమంటున్నారు. చదువుకోని వారు వచ్చినా నువ్వు ఎవడివో తెలుసుకోమంటున్నారు. చదువుకున్నవారికి, చదువుకోనివారికి ఒకటే మంత్రమా అన్నారు ప్లీడరుగారు. చదువులేని వారికి అబద్ధం చెప్పి, చదువుకున్నవారికి నిజం

చెప్పమంటారా అని భగవాన్ అడిగారు.

ఒక తమిళ రచయిత భగవాన్ మీద కొన్ని పద్యాలు వ్రాసి తీసుకొని వెళ్ళాడట. ఆ పద్యాలలో నీవు కుమారస్వామివే, ఈ రూపంలో వచ్చావు, నీవు నడుస్తున్న దేవుడివి ఇలా భగవాన్‌యొక్క గొప్పతనం వర్ణించి చెప్పాడట. నేను గొప్పవాడిని అని వ్రాసావు. నేను గొప్పవాడిని అయితే నీకు ఏమి కలిసివస్తుంది. నీవు బాగుపడే విధానం చూసుకో అన్నారు భగవాన్. వాడు రమణ మహర్షి అంటే ఆయన ఏమీ సంతోషించలేదు. నేను గొప్పవాడిని అంటే నీకు ఏమి కలిసివస్తుంది. నిన్ను నీవు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నించు. నీ హృదయంలో లేనిది నా హృదయంలో ఏమీ లేదు. నిన్ను నీవు ఉద్ధరించుకోవటం మానివేసి రమణమహర్షి గొప్పవాడు అంటే ఏమిటి ప్రయోజనం అన్నారట. నీకు కావాలనుకొంటే ఆయన రూపమును సపోర్టుగా తీసుకోవచ్చు, ఆయన సందేశమును సపోర్టుగా తీసుకోవచ్చును కాని ప్రయాణం చేయవలసింది నువ్వే. నీ అంతట నీవే బాగుపడాలి.

నీకు మోక్షం రాకుండా నీ దేహం అడ్డురావటం లేదు. అహంభావనే అడ్డువస్తోంది. అందువలన అహంభావనకు **food supply** ను **cut** చెయ్యి అహంభావనకు వెళ్ళే **food supply** ను **cut** చేస్తే ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే నీ లోపల ఉన్న సత్యవస్తువు నీకు వ్యక్తమవుతుంది.

ఇప్పుడు దేహము నీకు కనపడుతోంది. గాఢ నిద్రలో దేహము ఎక్కడ ఉందో నీకు తెలియదు. గాఢనిద్రలో దేహం లేకుండా ఎన్నో గంటలు గడిపేస్తున్నావు. ఆత్మలేని క్షణం లేదు. ఆత్మను విడిచి ఒక్క క్షణం కూడా నీవు లేవు. నీవు నిద్రపోతున్నప్పటికీ నీలోని చైతన్యం నిద్రపోవటం లేదు. నీవు నిద్ర పోతున్నప్పటికీ నీలోపల నిద్రపోకుండా నీ నిద్రను చూసేవాడు ఒకడు ఉన్నాడు. వాడిని పట్టుకో. వాడు జాగ్రదావస్థలో కూడా ఉన్నాడు. వాడిని పట్టుకుంటే నీవు తరిస్తావు.

నీవు ఎలాగో ఒకలాగా ఉండాలి. ఇప్పుడు నీవు దేహముగా ఉంటున్నావు, మనస్సుగా ఉంటున్నావు, అహంకారముగా ఉంటున్నావు. అలా ఉండే బదులు నీవు ఆత్మగా ఉండు జ్ఞానివి అయిపోతావు అంటున్నారు భగవాన్. నీవు దేహముగా ఉండే బదులు, మనస్సుగా ఉండే బదులు ఆత్మగా ఉండు నీకు జ్ఞానం వచ్చేస్తుంది అంటున్నారు భగవాన్.

బ్రహ్మదేవుడు, శివదేవుడు, విష్ణుదేవుడు వచ్చి మీకు కనిపిస్తారు అనుకోండి. మీరు ఏమైనా కోరుకుంటారా అని రమణమహర్షిగారిని అడిగితే కోరుకుంటాను అన్నారట. ఏమని కోరుకొంటారు అని అడిగితే మీరు ఎప్పుడూ నాకు కనపడవద్దని కోరుకుంటాను అన్నారట. అదీ జ్ఞానియొక్క వైభవము. దేహము ఉంటే ప్రపంచము, ప్రపంచము ఉంటే దేవుడు. ప్రపంచమునకు అతీతంగా, దేహమునకు అతీతంగా ఉన్న స్థితి అది.

నువ్వు ఉన్నట్లే ఉండు. క్రొత్తవి ఏవీ శాశ్వతం కాదు. క్రొత్తగా ఏదైనా వస్తే అది పోతుంది. దేహం వచ్చింది కాబట్టి అది పోతుంది.

పుట్టినపుడు ఏడుస్తూ పుడతాము. నీకు మరణం వచ్చేలోపు నీ లోపల ఎంత ఏడుపు ఉందో అది అంతా ఖర్చు అయిపోవటం మంచిది అన్నారు రమణ మహర్షిగారు. ఏడుపు అంతా అయిపోతే ఆనందం మిగులుతుంది. చనిపోయేలోపు సాధన చేసి మీలో ఉన్న ఏడుపును పోగొట్టుకుంటే ఇంక ఏడవనక్కరలేదు. శవాలు మోయనక్కరలేదు అని భగవాన్ చెప్పారు.

నూరు సంవత్సరాలు జీవించాలి, నూట ఇరవై సంవత్సరాలు జీవించాలి అనే గొడవ తప్ప జ్ఞానం

మనలను ఇంకా వరించలేదు ఏమిటి? మనం ఇంకా జ్ఞాన సముపార్జన చేయలేదు ఏమిటి అనే భావన ఎవడికీ కనబడదు.

ప్రతీ మానవుడు నేను దేహంలో ఉన్నాను. దేహమునకు బయట ప్రపంచము ఉంది. దేవుడు వైకుంఠంలో ఉన్నాడు అనుకొంటున్నాడు. నీ దేహబుద్ధివలననే ఇది అంతా నిజంలాగ కనబడుతోంది. నీ దేహబుద్ధి వలననే నీవు లోపల ఉన్నాను అనుకొంటున్నావు. దేహబుద్ధి నశిస్తే లోపలాలేదు, బయటా లేదు. నేను లోపల ఉన్నాను అనుకొంటున్నావు కాబట్టి బయట ప్రపంచము ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అనుకొంటున్నావు. ఇది అంతామనోకల్పితము. మనకు సత్యం అంటే ఇష్టం ఉండదు, దేవుడు అంటే ఇష్టం ఉండదు. మనస్సు కల్పించిన విషయములు అంటే ఇష్టపడతాము. ఆ విషయముల వెంట పడిపోతాము. మనస్సుయొక్క మూలమును వెతకటానికి ప్రయత్నము చేయము.

నీకు అనేక సంకల్పాలు వస్తూ ఉంటాయి, ఊహలు వస్తూ ఉంటాయి, భావాలు వస్తూ ఉంటాయి. వస్తే రానియ్యి. వాటి వెంట పరిగెట్టవద్దు. నీ nature ఏమిటో నీవు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. నీవు కోరికను repeated గా నెరవేరుస్తూ ఉంటే అది బలపడుతుంది. నీకు ఏ తలంపు వస్తే అదే నువ్వు అనుకోవద్దు. అలా అనుకోవటం వలన అది బలపడుతుంది. నీవు కోరికను satisfy చేస్తే దానిబలం పెరిగిపోయి అదే బలమైన వాసనగా మరల నీలో ప్రవేశిస్తుంది. అహంకారమును ప్రమాణముగా పెట్టుకోవద్దు. శాస్త్రమును ప్రమాణముగా పెట్టుకొని పని చెయ్యి.

మీరు అద్వైతానుభవం గురించి చెపుతున్నారు. ఇది చాలా బాగుంది, ఈ అరుణాచలంలో ఉన్న కొండను దేవుడు అంటున్నారు ఏమిటి అని ఒకరు అడిగారు. నీవు ఈ శవమును నేను, నేను అంటున్నావు. అలాగే దేవుడు ఆ కొండను నేను, ఆ కొండను నేను అంటున్నాడు. ఇది ఎంతనిజమో, అది కూడా అంతే నిజము అన్నారు భగవాన్. ఈ దేహమునకు ఎవరైనా నమస్కారము పెడితే నాకే పెట్టారు అనుకొంటున్నావు. నీవు దేహముతో ఉన్న తాదాప్యమువలన అలా అనుకొంటున్నావు. అలాగే కొండకు ఎవరైనా నమస్కారము పెడితే నాకే పెట్టారు అని దేవుడు అనుకొంటున్నాడు. నీవు ఈ శవంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగే ఆ కొండతో దేవుడు తాదాప్యం పొందుతున్నాడు. నీకు సత్యం కావాలా ఇది ఎంత సత్యమో అది కూడా అంతే సత్యము. నీవు ఈ శవంతో తాదాప్యము పొందుతున్నావు కాబట్టి దేవుడికి ఆ కొండతోటి, గుడిలోని వున్న రాయితోటి తాదాప్యం పొందవలసి వచ్చిందట. నీవు ఈ శవంతో తాదాప్యం పొందటం మానివేస్తే ఆయనకు ఆ కొండ తోటి తాదాప్యం అక్కరలేదట. అది subject.

మన ఇంటిలోనివారు ఎవరైనా చనిపోతే మనం దుఃఖపడతాము. వారు చనిపోయారు, మీరు దుఃఖ పడుతున్నారు. మిలోపల ఉండి దుఃఖపడేది ఎవరు? చనిపోయినవారి గురించి మిలో ఎవడైతే దుఃఖ పడుతున్నాడో ఆ దుఃఖపడే వాడిని విచారణ చేసినా మీకు జ్ఞానం కలుగుతుంది అని భగవాన్ చెప్పారు.

ఆత్మ నిజం అని చెప్పలేదు, ఆత్మ ఒక్కటే నిజం అని భగవాన్ చెప్పారు. మిగిలినవన్నీ నిజం కాదు అని చెప్పకుండా చెప్పటం. నిజం ఒక్కటే. అది నీ హృదయంలో ఉంది. అది తెలుసుకొన్నప్పుడే నీకు స్వేచ్ఛ, సుఖము, ఆనందము.

తపస్సు అంటే పొట్టను ఎండగట్టటం కాదు, శరీరాన్ని కృశింపచేయటం కాదు. అహంభావనను తొలగించుకోవటానికి నీవు పడే తపనే తపస్సు.

భగవాన్‌ను ఎవ్వరైనా ఉపదేశము చెప్పండి స్వామి అంటే ఉపదేశము ఉపదేశ సారములో ఉందికదా అనేవారట.